# హంసలను వేటాడొద్దు [21]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [21]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: సెప్టెంబరు 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=3566

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [21]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** ఒక పర్యావరణ సంబంధమైన గోష్టిలో పాల్గొనేందుకు యెగార్ మాస్కో చేరుకుంటాడు. అక్కడ యూరీ పెట్రోవిచ్ మొదటి భార్యని కలుస్తాడు. అక్కడ ఆమె మరొక పెళ్ళి చేసుకుని ఉంటుంది. ఆమె మరొక వివాహం చేసుకుని యూరీ పెట్రోవిచ్ కి ఆ అవకాశం లేకుండా చేయటం తప్పని చెప్తాడు. లోపలి గదిలో ఉన్న భర్తకు విషయం చెప్పబోయి అక్కడి ఆత్మీయ సన్నివేశం చూసి వెనక్కు తిరిగి వచ్చేస్తాడు. గోష్టిలో అతను నిజాయితీగా చేసిన ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంటుంది. నల్ల చెరువులో వదిలిపెట్టడానికి రెండు హంసల్ని జూలోంచి తీసుకువస్తాడు. వాటితో తిరిగి ఊరికి బయల్దేరతాడు. **ఇక చదవండి:—**

## 21

"నా జీవితానికి శాపమైన నా బతుకుకి భారమైన ఎందుకూ పనికిరాని అసమర్థుడైన నీ మీద దేవుడైనా జాలి..."

హారిటీనా ముందు యెగార్ సిగ్గుతో తలవంచుకుని నిలబడి ఉన్నాడు. పెద్ద పంజరాల్లోని హంసలు పాముల మాదిరి బుసకొడుతున్నాయి.

"అందరికీ డబ్బు సంపాదించేవాళ్లు మొగుడుగా దొరుకుతారు వాళ్ల ఇళ్లు సంపన్నంగా ఉంటాయి వాళ్ల భార్యలు చిలకల మాదిరి కులుకుతూ ఉంటారు!"

"వాటి రెక్కలు కత్తిరించమన్నారు," ఉన్నట్టుండి యెగార్ అన్నాడు. "లేకపోతే అవి దక్షిణానికి ఎగిరిపోతాయి."

హారిటీనా పెద్దగా ఏడ్వసాగింది. సిగ్గుతో, కోపంతో, నిస్సహాయతతో. రెక్కలు కత్తిరించటానికి కత్తెర కోసం యెగార్ పరిగెత్తాడు. అక్కడ, తన ఇంట్లో ఫ్యొడార్ ఇపటొవిచ్ పడీపడీ నవ్వుతున్నాడు.

"ఏమీ చేతకాని అసమర్థుడు! బుర్రలేని మొద్దు! ఇలాంటి వాడు మరొకడు లేడు!"

అతడిని చూసి ప్రతి ఒక్కరూ నవ్వసాగారు: మాస్కోలో సరుకులు ఏమీ కొనకుండా పోయి పోయి హంసలను తీసుకువచ్చాడు! అప్పులో పడ్డాడు, ఊరివాళ్లను నిరాశపరిచాడు, భార్యను బాధపెట్టాడు. ఒక్కమాటలో చెప్పాలంటే ఏమీ చేతకానివాడు.

యకోవ్ ప్రొకొపిచ్ ఒక్కడే నవ్వలేదు. “పర్యాటకులకు ఆకర్షణగా ఉంటుంది,” అన్నమాటలతో దానిని ఆమోదించాడు.

కోల్కాకి నవ్వు ఒక్కటే తక్కువయ్యింది. వాళ్ల నాన్న మాస్కోలో ఏనుగులను చూసి అచ్చెరువొందుతున్న తరుణంలో పెదనాన్న ఫ్యొడార్‌ని విచారణకు మూడుసార్లు పిలిచారు. ఈ కారణంగా ఫ్యొడార్ ఇపటొవిచ్ చట్టాల పుస్తకం కొని దానిని కంఠస్తం చెయ్యసాగాడు, “ఇల్లు తీసేసుకుంటారు లాగుంది. పరిస్థితులు అలాగే కనపడుతున్నాయి.”

మారిట్సా పెద్దగా రాగం అందుకుంది, ఓవా వణకసాగి కుక్కపిల్లను ముంచెయ్యటానికి పరిగెత్తాడు. కోల్కా ఎలాగో, అదీ ఆ క్షణానికి, ఆ పనినుంచి అతడిని విరమింప చెయ్యగలిగాడు.

“మమ్మల్ని ఇల్లు ఖాళీ చేయిస్తే ప్రతీకారంగా దానిని తప్పకుండా ముంచేస్తా!”

ప్రతిన బూనినట్లు చెప్పిన ఆ మాటలను అనుమానించటానికి లేదు: ఆ కుక్కపిల్లను ముంచెయ్యగలడు. ఆ తరువాత ఏ కారణంగానో ఓల్యా కుజినా వింతగా ప్రవర్తించసాగింది, ఓవాతో స్నేహం మానేసింది. ఆమె ఆడపిల్లలతో తిరుగుతూ కోల్కా తన వెంటపడుతున్నట్టు ఏదేదో వదరుతోంది.

యెగార్ ఆ మరునాడే చెరువుకి బయలుదేరాడు. హంసలకు ఇల్లు కట్టి వాటిని వదిలిపెట్టాడు. అవి మొదట గోలగోలగా అరిచాయి, కత్తిరించిన రెక్కలను టపటపా కొట్టుకున్నాయి, కాసేపు పోట్లాడుకున్నాయి కూడా. కానీ చివరికి నెమ్మదించాయి. తమ గూటిలోను, నీటిలోను తిరుగుతూ పక్కపక్కన ఉంటున్న రెండు కుటుంబాల మాదిరి సంతోషంగా ఉన్నాయి.

హంసలు కుదురుకున్నాయన్న నమ్మకం కలిగిన తరువాత యెగార్ వాటిని విడిచి వెళ్లసాగాడు. అడవిలో తిరిగి పాఠశాల కోసం ఎండిన కొమ్మలు సేకరించాడు. ప్రిన్స్‌పాల్ కోసం కొన్ని కట్టెలు స్వయంగా నరికాడు. చదువుకున్నవాళ్లంటే గౌరవంతోనే కాదు, ప్రిన్స్‌పాల్‌తో మాట్లాడవలసిన పని కూడా ఉంది.

ఆ రోజు సాయంత్రమే అతడు ప్రిన్స్‌పాల్ ఇంటికి వెళ్లాడు. డాక్టరైన అతడి భార్య – కోల్కా గాయాలకు ఆమె చాలాసార్లు వైద్యం చేసింది – ఎవరో ప్రసవానికి వెళ్లవలసివచ్చింది. దాంతో ప్రిన్స్‌పాలే రంగంలోకి దూకాడు.

"నీకు టీ స్ట్రాంగ్‌గా కావాలా, యెగార్ సవెలిచ్?"

"ఆ." యెగార్ తన కప్పు తీసుకుని చాలాసేపు గరిటతో తిప్పుతూ కూర్చున్నాడు. "నోనా యురీవ్నా గురించి ఏం చేస్తే బాగుంటుంది?"

"ఆమె చాలా మంచి టీచరు, ఆవిడ లేకపోవటం చాలా బాధగా ఉంది."

"ఆమె మీకు టీచరు, నాకు ఒక మంచి వ్యక్తి, యూరి పెట్రోవిచ్‌కి ప్రియురాలు."

నోనా యురీవ్నాని యూరి పెట్రోవిచ్ ప్రేమిస్తున్నాడన్న సంగతి ప్రిన్స్‌పాల్‌కి అప్పటిదాకా తెలియదు. అయితే అతడు ఆ విషయం బయటపడనివ్వకుండా కనుబొమ్మలు ఎగరవేసాడంతే.

"అధికారికంగా ఆమెను వెనక్కి రప్పించే ప్రయత్నం చేస్తే బాగుంటుందా?"

"అధికారాన్ని ఉపయోగిస్తే ఆమెకు ఇష్టంలేని పని చేయించినట్టు అవుతుంది. దానివల్ల మీకు ఇబ్బంది ఉండకపోవచ్చు కానీ యూరి పెట్రోవిచ్‌కి ఏమీ మేలు జరగదు."

"అదీ నిజమే," ప్రిన్స్‌పాల్ అతడితో ఏకీభవించాడు. అతడి ముఖం విచారంగా మారిపోయింది.

"నేనే వ్యక్తిగతంగా వెళ్లవలని ఉంటుంది," అతడి సలహా కోసం చూడకుండా అన్నాడు యెగార్. "శీతాకాలం ప్రవేశించగానే నేను వెళతాను. మీరు ఒక ఉత్తరం రాయండి. కాదు రెండు రాయండి."

"రెండెందుకు?"

"ఒకటి ఇప్పుడు, రెండవది తరువాత. దానితో ఆమెకు విషయం తెలుస్తుంది, దాని గురించి ఆలోచనలో పడుతుంది. ఆ సమయంలో నేను వెళతాను. అప్పుడు ఆమె ఒక నిర్ణయానికి రావలసి ఉంటుంది."

ప్రిన్స్‌పాల్ దానిగురించి కొంచెంసేపు ఆలోచించి ఉత్తరం రాయటానికి కూర్చున్నాడు. తన ప్రతిపాదనను అంగీకరించినందుకు సంతోషిస్తూ యెగార్ తీరికగా చుట్ట కాల్చుకుంటూ

కూర్చున్నాడు. అతడు గదంతా పరికించి చూడసాగాడు: కలపతో చేసిన బీరువా, ఇంట్లో తయారుచేసుకున్న అరలు, వందలకొద్దీ పుస్తకాలు. పుస్తకాలపైన ఒక వర్ణచిత్రం వేలాడుతూ ఉంది.

యెగార్ నిటారుగా నిలబడి దానిని పరీక్షగా చూడసాగాడు. ఆ చిత్రం ఎర్రగా ధగధగలాడిపోతోంది. ఒక ఎర్రటి గుర్రం నీలం, నలుపులలో ఉన్న దేనినో తొక్కుతూ ఉంది. ఆ గుర్రాన్ని స్వారీ చేస్తున్న యువకుడు కింద ఉన్నదానిని కత్తితో పొడుస్తున్నాడు.

ఆ చిత్రమంతా రౌద్రంతో సజీవంగా ఉంది. గుర్రం అసాధారణ అతిశయాన్ని కనబరుస్తూ ఉంది, అది అంత ఎర్రగా ఉండటం సహజంగా ఉంది. అటువంటి గుర్రాన్ని యెగారే చిత్రించాల్సి ఉంటే అతడు కూడా ఎర్ర రంగే వేసి ఉండేవాడు. ఇది అలాంటి ఇలాంటి గుర్రం కాదు – విజేత గుర్రం. ఆ గుర్రం అతడిని పూనినట్టు దానినే తేరిపార చూస్తున్నాడు – ఆ క్రమంలో కుర్చీకి కొట్టుకున్నంత పనయ్యింది.

"బాగుందా?"

"ఏమి గుర్రం!" యెగార్ మెల్లగా అన్నాడు. "అది... అదొక జ్వాల. ఆ యువకుడు – ఆ జ్వాలమీద స్వారీ చేస్తున్నాడు."

"అది నాకు కానుకగా లభించింది," ఆ వర్ణచిత్రం దగ్గరకు నడుస్తూ చెప్పాడు ప్రిన్స్‌పాల్. "ఎంత చక్కని ప్రతీక: మంచికీ, చెడుకీ మధ్య పోరాటం – చాలా సమకాలీనమైనది. అతడు సేంట్ జార్జి – రాకాసిబల్లి సంహారకుడు, అజేయుడు." ఇక్కడ ప్రిన్స్‌పాల్ యెగార్ వైపు సందేహంగా చూసాడు. కానీ యెగార్ ఆ చిత్రంవైపే తదేకంగా చూస్తున్నాడు. "అన్ని కాలాలకు వర్తించే అంశం. వెలుతురూ, చీకటి; మంచీ, చెడు; నిప్పూ, నీరు."

"నాదీ అదే పేరు," ఉన్నట్టుండి అన్నాడు యెగార్. "జార్జి"కి ఉన్న అనేక నామాల్లో "యెగార్" ఒకటి. "ఇక్కడ ఊళ్లో నన్ను అసమర్థుడని అంటారు. అది మీరు విన్నారా?"

"విన్నాను," ప్రిన్స్‌పాల్ కొంత ఇబ్బందిగా అన్నాడు. "కానీ ఈ ప్రాంతంలో ఇలా పేర్లు..."

"నాకేమనిపిస్తోందో తెలుసా? నా వెంట దురదృష్టం వస్తుందని నన్ను ఏమీ చేతకానివాడంటారని అనుకున్నాను. కానీ అది నిజం కాదేమోననిపిస్తోంది. నా పేరులాంటి పేరే ఉన్న వ్యక్తిలాగా నేను లేనని అలా అంటున్నట్లుంది."

ఈ మాటలను ఎంతో వ్యథతో పలికాడు, అంతసేపు అతడి కళ్లముందు ఆ గుర్రం కదలాడుతూనే ఉంది, గుర్రమూ, ఆ గుర్రంమీద స్వారీ చేస్తున్న యువకుడూను.

“అజేయుడైన జార్జి, నేను నీలాంటివాడిని కాను. ఈ జన్మలో కాలేనని అంగీకరించాలి!”

★★★

అయితే ఆ హంసలు తెల్లని తెలుపులో మెరిసిపోతున్నాయి. వాటి దగ్గర ఉన్నప్పుడు అంతకుముందు అతడిలో వ్యక్తమైన వ్యథ ఇసుమంతైనా లేకుండా మాయమైపోయింది.

“ఎంత అందంగా ఉన్నాయి!” యెగార్‌ని చూడటానికి వచ్చినప్పుడు అన్నాడు యూరి పెట్రోవిచ్.

అవి తీరానికి దగ్గరగా ఈదులాడుతున్నాయి. ఇంతకుముందు ఎరగని తాదాత్మ్యతను యెగార్ పొందాడు, వాటిని చూస్తూ గంటల తరబడి గడిపెయ్యగలుగుతున్నాడు.

అతడు అడవంతా తిరిగి రెండు పాత మొద్దులను పట్టుకొచ్చాడు. ఇప్పుడు అతడి తాత్కాలిక నివాసం పక్కన మరో రెండు హంసలు వంపు తిరిగిన మెడలతో ఉన్నాయి.

“అవి వంటరిగా ఉన్నాయి,” నిట్టూరుస్తూ అన్నాడు యెగార్. “వాటి జాతి పక్షులు ఆకాశంలో ఎగురుతున్నప్పుడు అవి ఏడుస్తాయి. నా గుండె ముక్కలవుతుంది.”

“ఆందోళన చెందవద్దు, ఈ శీతాకాలం గడిస్తే అవి కూడా ఎగరగలుగుతాయి.”

“వాటికి ఇంకొక మంచి ఇల్లు తయారు చేస్తాను – పందిని ఉంచిన కొట్టం కలప దీనికి సరిపోతుంది. చెరువు గడ్డకట్టుకునే సమయానికి వాటిని అందులోకి మార్చేస్తాను.”

బదులుగా యూరి పెట్రోవిచ్ ఏమీ మాట్లాడలేదు. అతడు లెనిన్‌గ్రాడ్ వెళ్లి ఎంత బతిమాలినా గాని ఇక్కడికి తిరిగి రావటానికి నోనా తిరస్కరించింది. దాంతో అతడు నవ్వటం మరిచిపోయాడు.

“యూరి పెట్రోవిచ్, ఈ చెరువు పేరుని అధికారికంగా హంసలచెరువుగా మార్చమని ఉత్తరం రాయి.”

“అలాగే,” చువలోవ్ నిట్టూర్చాడు.

అతడు విచారంగానే వచ్చి, విచారంగానే తిరిగి వెళ్లాడు. కానీ యెగార్ అక్కడే ఉండిపోయాడు: అడవికి కొంత చేరువలోనే రోడ్డు పని జరుగుతుండటంతో అడవిలోని చెట్లు కూడా నరికేస్తారేమోనని అతడి భయం. అయితే అటవీ భూమిలోకి ఎవరూ రాలేదు: ఫిల్, క్రోక్ కూడా రోడ్డు నిర్మాణం పనిలోకి వెళుతున్నారు. రోడ్డు నిర్మాణానికి అడ్డం వచ్చిన పెద్ద పెద్ద చెట్లను పడవేస్తూ క్రోక్ సంతోషిస్తున్నాడు: అతడికి పేలుడు పదార్థాలతో ఆడుకోవటమంటే మొదటినుంచి సరదానే.

రోడ్డు మలుపు తిరిగి పొలాలనుంచి దూరం కావటంతో పేల్చెయ్యవలసినవేమీ మిగలలేదు. రోడ్డు నిర్మాణం దూరానికి వెళ్లిపోవటంతో యంత్రాల రొద కూడా తగ్గిపోయింది. అయితే యెగార్‌కి ముచ్చటగా ఉన్న ఈ తాత్కాలిక వసతిని విడిచి వెళ్లాలనిపించటం లేదు. దానికి ఇరువైపులా రెండు కొయ్య హంసలు వంపుతిరిగిన మెడలతో వయ్యారంగా నిలబడి ఉన్నాయి.

అయితే ఆకురాలే కాలంతోపాటు నల్లగా మబ్బులు కమ్మి వానలు రావటంతో యెగార్ చెరువు వద్దును వదిలి వెళ్లక తప్పలేదు. అతడు ఊళ్లో తన ఇంటికి మారాడు. మొదట్లో ప్రతిరోజూ వచ్చి హంసలను చూసేవాడు, ఆ తరువాత అంత తరుచుగా వెళ్లటం తగ్గించేసాడు. తెల్లవారేసరికి చిన్న చిన్న మీటి మడుగులు గడ్డకట్టుకుంటున్నాయి: అంటే హంసల గూడు సరిచెయ్యాల్సిన సమయం వచ్చింది.

ఆ రాత్రి వాతావరణం భీకరంగా ఉంది. మబ్బులు బండి గురువింద చెట్ల కిందకల్లా ఉండి కుండపోతగా వర్షం కురుస్తోంది. కవుకు చెట్లలో గాలి తీవ్రంగా రొదపెడుతోంది. అంతకు ముందు రోజు నుంచి యెగార్‌కి కొంచెం నలతగా ఉంది. ఆవిరి స్నానం చేసి టీ తాగాడు. అతడు నిద్రపోవలసింది కానీ ఆందోళనగా ఉన్నాడు: ఈ వాతావరణంలో హంసలు ఎలా ఉన్నాయి? గూడు దాదాపుగా తయారయ్యింది కాబట్టి వాటిని అందులోకి మార్చి ఉండాల్సింది – కానీ ఇంతలోకే అతడు జబ్బుపడ్డాడు. అతడు పక్కమీద అటూ, ఇటూ దొర్లుతున్నాడు. అతడి వంటి వేడికి పక్కనున్న హోరిటీనా కూడా కాగిపోతోంది. అర్ధరాత్రి కావస్తుండగా బట్టలు వేసుకుని చుట్ట కాల్చటానికి బయటకు వెళ్లాడు.

వాతావరణం కొంచెం ప్రశాంతంగా మారింది: అడవి మెల్లగా గుసగుసలాడుతున్నట్టు ఉంది, వాన తగ్గి తుంపరగా మారింది. యెగార్ వసారాలో కూర్చుని ప్రశాంతంగా చుట్ట

కాల్చుకుంటూ ఉండగా అడవిలోంచి ఫెళఫెళమంటూ శబ్దం వినపడింది. మొదట అది ఉరుము అనుకున్నాడు. కానీ ఈ కాలంలో ఉరుములు అరుదు. అడవినుంచి వచ్చిన ఆ శబ్దమేమిటో పూర్తిగా గ్రహించకుండానే అతడు ఒక్కుదుటన లేచి గుర్రానికి కళ్లెం బిగించసాగాడు.

కిర్రుమంటూ కొట్టం తలుపు చేసిన చప్పుడుకి హారిటీనా నైటీలోనే బయటకు వచ్చింది. ఆమె చేతులను ఎదమీద కట్టుకుని ఉంది.

"ఏమి చేస్తున్నావు, యెగార్! పైగా నీకు జ్వరంగా కూడా ఉంది."

"నేను చెరువు దగ్గరకు వెళుతున్నాను, టీనా," అన్నాడు యెగార్, నిద్రమత్తులో ఉన్న గుర్రాన్ని బయటకు తీస్తూ. "కోల్కా నిన్న పర్యాటకుల గురించి ఏదో చెప్పాడు, నాకు ఆందోళనగా ఉంది."

కోల్కా అంతకుముందు రోజు దుకాణం దగ్గర తెల్ల జుట్టోడిని చూశాడు.

గతంలో చీమలను తగలబెట్టింది అతడే.

"ఓయ్, అబ్బాయ్!"

"హలో," అంటూనే కోల్కా అక్కడినుంచి పరిగెత్తాడు.

తెల్ల జుట్టోడు వోడ్కా సీసాలు పట్టుకెళుతున్నాడు. జాలీసంచి నిండుగా సీసాలు ఉన్నాయి: సంచి ఖాళీల గుండా వాటి మూతులు బయటకు చూస్తున్నాయి. కోల్కా ఆ విషయం నాన్నతో చెప్పాడు.

హారిటీనా అతడిని ఆపలేకపోయింది. ఆ రాత్రి చీకటిలో ప్రభుత్వ గుర్రాన్ని తీసుకుని యెగార్ బయలుదేరాడు. ఆమెకు తెలిసి ఉంటే దారికి అడ్డంగా పడుకుని ఉండేదే, కానీ అది తెలియక ఎప్పటిమాదిరి అతడిని తిట్టింది:

"ఇంత రాత్రప్పుడు ఎక్కడికి వెళుతున్నావు, ఎందుకూ పనికిరాని అసమర్థుడా?"

అవే ఆమె ఆఖరి మాటలు; జీవితం మాదిరి నిర్దయతో కూడినవి. సగం దూరం వెళ్లకముందే రెండవసారి ఫెళఫెళమన్న శబ్దం వినపడింది. దూరంనుంచి వచ్చిన ఆ శబ్దం తేమగా ఉన్న గాలిగుండా పేలవంగా యెగార్‌కి వినపడింది. అది నల్లచెరువు నుంచి వచ్చిందని యెగార్ గ్రహించాడు. మనుషుల గొంతులు విని నమ్మకంతో దగ్గరకు వచ్చి తమ మెడలను సాచే హంసల గురించి ఆలోచించసాగాడు.

మడాలతో డొక్కల్లో పొడుస్తూ ముసలి గుర్రాన్ని పరిగెత్తించటానికి యెగార్ ప్రయత్నించాడు. అయితే పరిగెత్తటానికి దానికి శక్తి ఎక్కడిది? అతడు అసహనంతో కిందకి దూకి గుర్రం కంటే ముందు పరిగెత్తసాగాడు. రొప్పుతూ గుర్రం అతడి వెనకాల పరిగెత్తుతోంది. కానీ కొంత సేపటికి అది వెనక పడిపోయింది: గుర్రమైనప్పటికీ యెగార్ అంత వేగంగా అది పరిగెత్తలేకపోయింది.

దూరంనుంచే అతడికి కవుకు చెట్ల కాండాల మధ్యనుంచి మనుషులు చేసిన మంట కనిపించింది. మంట పక్కన కొన్ని ఆకారాలు కనిపిస్తున్నాయి. చెరువు తీరం దగ్గరనుంచి ఒక గొంతు విలపడుతోంది: "ఆ పొదల కింద చూడు, బల్లెంచేప మాదిరి ఉంది."

"ఇక్కడంతా చాలా చీకటిగా ఉంది!"

పొదలను తొక్కుకుంటూ యెగార్ తిన్నగా వాళ్లవైపుకి పరిగెత్తాడు. కొమ్మలు అతడి ముఖానికి గీసుకునిపోతున్నాయి. అతడి గుండె గొంతుకలో కొట్టుకుంటూ ఉండటంతో అతడు వణికిపోతున్నాడు.

"ఆగండి!" చీకటిలో ఉండగానే పొదలలోంచి అతడు అరిచాడు. మంట దగ్గర ఉన్నవాళ్లు నిశ్చేష్టులయ్యారు. మళ్లీ అరుద్దామని యెగార్ అనుకున్నాడు కానీ బాగా రొప్పుతూ ఉండటం వల్ల మంటవరకు నిశ్శబ్దంగా పరిగెత్తాడు. ఊపిరి తీసుకోటానికి అతడు క్షణంపాటు ఆగాడు. ఆ లిప్త కాలంలోనే మంటమీద నీటితో మరుగుతున్న కుండ, దాంట్లోంచి బయటకు వచ్చిన రెండు హంస కాళ్లు కనిపించాయి. మరో మూడు హంసలు ఆ పక్కనే పడి ఉన్నాయి. వాటి బూరు ఇంకా పీకలేదు కానీ తలలు మాత్రం కోసేసి ఉన్నాయి. మంటలలో అయిదవ హంస – ఇది కొయ్యది – మండుతూ ఉంది: ఇప్పుడది కూడా చెరువు మాదిరి నల్లగా ఉంది.

"ఆగండి..." అతడి మాటలు మెల్లగా వచ్చాయి. "మీ పత్రాలు ఇటివ్వండి."

మంట పక్కన ఇద్దరు మనుషులు నిలబడి ఉన్నారు కానీ యెగార్ వాళ్ల ముఖాలు చూడలేదు. వాళ్లల్లో ఒకరు వెంటనే చీకటిమాటుకి తప్పుకుంటూ, "అటవీ అధికారి," అన్నాడు.

గాలి హోరుమంటోంది, కుండలోని నీళ్లు మరుగుతున్నాయి, మంటలో కాలుతున్న కొయ్య హంసలు చిటపటమంటున్నాయి. ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

"మీ పత్రాలు," గొంతు తడారి పోతుండగా యెగార్ మళ్లీ అడిగాడు. "మిమ్మల్నందరినీ నిర్బంధంలోకి తీసుకుంటున్నాను. మీరంతా నాతో రావాల్సి ఉంటుంది."

“ఇక్కడినుంచి వెళ్లిపో,” మంట పక్కన ఉండిపోయిన వ్యక్తి మెల్లగా, బద్ధకంగా అన్నాడు. “మాకు కోపం రాకముందే ఇక్కడినుంచి వెళ్లిపో. నువ్వు మమ్మల్ని చూడలేదు, నువ్వెవరో మాకు తెలియదు.”

“నేను నా స్థానంలో ఉన్నాను,” బలంగా ఊపిరి తీస్తూ అన్నాడు యెగార్. “మీరెవరో నాకు తెలియదు.”

“ఇక్కడినుంచి వెళ్లిపొమ్మన్నానా.”

చెరువు దగ్గర నుంచి నీటి శబ్దం, సంతోషంతో కూడిన కేక వినిపించాయి: “చాలా పెద్ద చేప దొరికింది! తేలికగా మణుగున్నర ఉంటుంది.”

“చేపలను పడుతున్నారు,” యెగార్ నిట్టూరుస్తూ అన్నాడు. “హంసలను చంపారు. ఎటువంటి మనుషులు మీరు!”

చీకటినుంచి ఒక ఆకారం రాసాగింది.

“చలికి నేను గడ్డ కట్టుకుపోయాను. ఒక వోడ్కా సీసా తీస్తే బాగుంటుందోయ్, మిత్రమా..”

యెగార్‌ని చూడటంతోనే అతడు ఆగిపోయి, వెనక్కి అడుగువేసి చీకటిలోకి వెళ్లిపోయాడు. ఇంకొకరెవరో తీరం దగ్గర పడవలో ఉన్నారు. నాల్గవ వ్యక్తి వెలుతురుగా ఉన్న వృత్తంలోకి రాకుండా దాక్కుని ఉన్నాడు.

“అతడికి ఏం కావాలంట?” చీకట్లోకి వెనక్కి తగ్గిన వ్యక్తి అడిగాడు.

“ముఖంమీద ఒక్క గుద్దు.”

“అదంత కష్టం కాదులే.”

“మీ పత్రాలు,” యెగార్ మొండిగా మళ్లీ అడిగాడు. “నేను మిమ్మల్ని వదలబోవటంలేదు. పోలీసు స్టేషనుకు తీసుకెళ్లి మిమ్మల్ని అప్పగిస్తాను.”

“మమ్మల్ని భయపెట్టాలని చూడవద్దు,” చీకటిలోంచి ఒక గొంతు వినపడింది.

“ఇది పగలు కూడా కాదు.”

"అతడు మనల్ని భయపెట్టాలనుకోవటం లేదు," మొదటి వ్యక్తి అన్నాడు. "తన ధర పెంచుకోటానికి చూస్తున్నాడు. అంతే కదటోయ్? మరి ఒప్పందం కుదుర్చుకుందామా? ఇక్కడ కూర్చుని అరలీటరు తాగు, తరువాత ఇరవైఅయిదు రూబుళ్లు తీసుకుని మాయమైపోదువుగాని."

"మీ పత్రాలు," యెగార్ అలసటగా అన్నాడు. "మిమ్మల్నందరినీ నిర్బంధిస్తున్నాను."

అతడి వళ్లంతా కాలిపోతోంది, తల తిరుగుతోంది, మోకాళ్లు బలహీనంగా అనిపిస్తున్నాయి. అతడికి కూర్చుని మంటదగ్గర చలి కాగాలనిపిస్తోంది. కానీ వాళ్ల పత్రాలు స్వాధీనం చేసుకునేదాకా అతడు స్థిమితపడలేదు.

మరొక వ్యక్తి ఈల వేసుకుంటూ చెరువు వడ్డు దగ్గర నుంచి వస్తున్నాడు. ఇద్దరు ఏదో గుసగుసలాడుతున్నారు. నాలుగో వ్యక్తి కనపడటంలేదు: అతడు దాక్కుని ఉన్నాడు.

"యాభై," అన్నాడు మొదటి వ్యక్తి. "దాంతో ఒప్పందం ఖరారు చేసుకుందాం."

"మీ పత్రాలు. చట్టాన్ని ఉల్లంఘించినందుకు మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాను."

"చూడు," అన్నాడు మొదటి వ్యక్తి, బెదిరింపు ధోరణిలో. "సంధి కుదుర్చుకోవాలని లేకపోతే నీ ఇష్టం."

మంటమీదకి ఒంగి హంసను కత్తితో ఒక పోటు పొడిచాడు. రెండవ వ్యక్తి చెరువు దగ్గర ఈల వేస్తున్న వ్యక్తి వైపుకి వెళ్లాడు.

"హంసలను ఎందుకు చంపారు?" యెగార్ నిట్టూర్చాడు. "అవి జీవితాన్ని అలంకరిస్తాయి."

"నువ్వు కవివి కూడానోయ్."

"పద. ఇప్పటికే ఆలస్యం అయ్యింది, మనం చాలా దూరం కూడా వెళ్లాలి."

"అతడికి గుణపాఠం నేర్పండి."

వెనకనుంచి అతడి చెవిమీదుగా భుజంపైన లావుపాటి కర్రతో ఒక దెబ్బపడింది. యెగార్ తూలి మోకాళ్లమీదకి కూలిపోయాడు.

"మీరేం చేసినా నేను చట్టానికి ప్రతినిధిని! మీ పత్రాలు నాకు కావాలి! ఇటు ఇవ్వండి –"

"ఆహా, మా పత్రాలు కావాలా?.."

కఱ్ర మళ్లీ, మళ్లీ అతడి మీద పడింది. యెగార్ ఆ దెబ్బలు లెక్కపెట్టటం మానేసాడు, వణకుతున్న కాళ్లు, చేతులమీద పాకుతూనే ఉన్నాడు. అతడు పాకుతూనే దెబ్బ దెబ్బకీ కింద మెత్తగా ఉన్న నాచులో తల దాచుకోసాగాడు. అయినా, "మీ పత్రాలు ఇవ్వండి! మీ పత్రాలు ఇవ్వండి!" అంటూనే ఇవ్వండి.

"మన పత్రాలు కావాలంట!"

ఇప్పుడు ఒకటి కాకుండా రెండు కఱ్రలు యెగార్ వీపు మీద పడుతున్నాయి. బూటుతో ఒక బలమైన పాదం అతడి ముఖాన్ని పదే పదే తంతోంది. "కుక్కని ఉసికొల్పండి! కుక్కని తీసుకురండి!" అంటూ ఎవరో అరిచారు.

"కరువు! కరువు!"

కానీ ఆ కుక్క యెగార్‌ని తాకలేదు. ఆ రక్తం, మానవ క్రూరత్వం చూసి భయపడిపోయి అది పెద్దగా ఏడ్చింది. యెగార్ ఇక అరవటంలేదు, రక్తం ఊస్తూ బొంగురు గొంతుతో అడుగుతూనే ఉన్నాడు. వాళ్లు అతడిని కొడుతూనే ఉన్నారు, దెబ్బ దెబ్బకీ తీవ్రత పెరుగుతూనే ఉంది. ఇక యెగార్‌కి ఏమీ కనపడటం లేదు, వినపడటం లేదు, తెలియటం లేదు.

"ఇక ఆపెయ్, ల్యోన్యా, అతడు చచ్చిపోతాడు."

"వెధవ!"

"ఆపెయ్‌మన్నానా! ఇక వెళ్లాల్సిన సమయం అయ్యింది. నీ చేప తీసుకో మిత్రమా. మన ఒప్పందం ప్రకారం నాకు డబ్బులు ఇవ్వు."

ఎవరో బూటు బలంగా అతడి నుదుటిని తాకింది. వానతో, రక్తంతో తడిచిన నాచుమీద యెగార్ తల అదిరింది – దాంతో అతడిని వదిలిపెట్టారు. వాళ్లు మంట దగ్గరకి వెళ్లి ఏదో తీవ్రంగా మాట్లాడుకుంటున్నారు. కానీ యెగార్ వదిలిపెట్టలేదు. వళ్లంతా రక్తసిక్తమైనప్పటికీ ఎలాగో లేచి నిలబడి పగిలిన పెదాలతో తడబడుతూ, "చట్టం – మీ పత్రాలు –" అన్నాడు.

"సరే, మా పత్రాలు తీసుకో!"

వాళ్లందరూ ఒక్కసారిగా అతడిమీద పడి మళ్లీ కొట్టం మొదలుపెట్టారు. అతడు గొణగటం ఆపేవరకు కొడుతూనే ఉన్నారు. చివరికి అతడిని వదిలిపెట్టి వెళ్లారు. విరిగిపోయిన యెగార్ శరీరం ఉండి ఉండి ఉలిక్కిపడుతోంది. అయితే ఆ ఉలికిపాటు కూడా చాలా తక్కువగా ఉంది.

ఆ మరునాడు సాయంత్రం అతడిని సగం దారిలో కనుగొన్నారు. నల్లచెరువు నుంచి అక్కడి దాకా ఎలాగో పాక్కుంటూ రాగలిగాడు, ఆ దారంతా రక్తమయమయ్యింది. నల్లచెరువు దగ్గర ఆర్పేసిన మంట, ధ్వంసమైన తాత్కాలిక నివాసం, హంసల ఈకలు, మసిబారిన కొయ్య హంస కనిపించాయి. ఆ హంస ఇప్పుడు తెల్లగా లేదు, నల్లగా ఉంది.

ఆ మరునాడు యెగార్ స్పృహలోకి వచ్చాడు. ఆసుపత్రిలో ఒక ప్రత్యేక గదిలో అతడిని ఉంచారు. ఏమాత్రం వినిపించని స్వరంలో అతడు సమాధానాలు చెపుతున్నాడు. అతడు చెప్పేది అర్థంకాక విచారణాధికారి మళ్లీ మళ్లీ అడుగుతున్నాడు: యెగార్ నోట్లో పళ్లు, వంట్లో బలం మిగిలి లేవు, వాచి ఉన్న అతడి పెదాలు కదలటానికి ఇష్టపడటంలేదు.

"నీకు నిజంగా గుర్తులేదంటావా, పొలుష్కిన్? కొన్ని చిన్న చిన్న విషయాలు కూడా గుర్తులేవా? వాళ్లని పట్టుకుంటాం. ప్రజల్ని చైతన్యపరుస్తాం."

విచారణాధికారి ముఖంలోకి తేరిపార చూడటం తప్పించి యెగార్ ఏమీ మాట్లాడలేదు.

"వాళ్లల్లో ఎవరినైనా అంతకుముందెప్పుడైనా చూసావా? గుర్తు తెచ్చుకోటానికి ప్రయత్నించు. నీకు తెలిసినవాళ్లు ఉండి ఉండవచ్చు."

"వాళ్లు తెలియని వాళ్లైతే చంపేసి ఉండేవాడిని," యెగార్ మెల్లగా, స్పష్టంగా పలికాడు. "నాకు తెలుసు, అందుకే క్షమించాను."

"ఏమిటి?" ఏమి చెపుతున్నాడో అర్థం చేసుకోటానికి విచారణాధికారి ముందుకి వంగి అడుగుతున్నాడు. "పొలుష్కిన్, వాళ్లని గుర్తించావా? వాళ్లని గుర్తుపట్టగలవా? ఎవరు వాళ్లు? వాళ్లెవరో చెప్పు."

విచారణాధికారి పని సాధ్యమైనంత తొందరగా ముగిస్తే బాగుండుననుకుంటున్నాడు యెగార్. ఇంజెక్షన్లతో అతడి నొప్పి కొంచెం తగ్గి, ప్రశాంతమైన ఆలోచనలు అతడి తలలో మెల్లగా విహరిస్తున్నాయి. వాటిని స్వాగతించటం యెగార్‌కి బాగుంది, వాటితో కాసేపు ముచ్చటించి పంపించేస్తున్నాడు. ఉమ్మడి వ్యవసాయ క్షేత్రంలో యువకుడిగా ఉన్న రోజులు గుర్తుకొచ్చాయి: చైర్మన్ దేనికో అతడిని మెచ్చుకుంటూ నవ్వుతున్నాడు, యెగార్ కూడా నవ్వుతున్నాడు. ఇక్కడికి వచ్చిన తొలిరోజులు గుర్తుకువచ్చాయి. అతడు చెక్కిన కోడిపుంజు గుర్తుకొచ్చింది, వెంటనే దాని బొమ్మ కళ్లముందు మెదిలింది. నవ్వుతూ ఉన్న బాతుపిల్ల, పందిపిల్ల గుర్తుకొచ్చాయి; యకోవ్

ప్రొకొపిచ్ కోపం, పర్యాటకులు, మునిగిపోయిన మోటరు గుర్తుకొచ్చాయి. అయితే ఎవరిపట్లా అతడికి ద్వేషభావం లేదు; ఇప్పుడుకూడా అతడు అందరినీ చూసి నవ్వుతున్నాడు. అలా నవ్వుతూనే తన జీవితాన్ని మంచితనంతో గడిపానని ప్రశాంతంగా అనుకున్నాడు. అతడు ఎవరికీ ఎటువంటి హానిచెయ్యలేదు కాబట్టి హాయిగా చనిపోవచ్చు, నిద్రపోయినంత తేలికగా చనిపోవచ్చు.

అయితే అతడి ఆలోచనలను తుదకంటా కొనసాగించే అవకాశం అతడికి ఇవ్వలేదు. ఒక నర్సు లోపలికి వచ్చి అతడికోసం బయట ఎవరో ఉన్నారని, ఎంత చెప్పినా వినటం లేదని, లోపలికి పంపించమంటారా అని అడిగింది. బదులుగా యెగార్ కళ్లు మిటకరించాడు. ఆమె వెళ్లిపోయిన తరువాత తలుపు తెరుచుకుని ఫ్యొడార్ ఇపటొవిచ్ వచ్చాడు.

తలుపుసందులోంచి అతడు పక్కగా నడుచుకుంటూ వచ్చాడు. తలుపుదగ్గర నిలబడి తల ఎత్తుతూ, దించుతూ, ఒక కాలుమీదనుంచి మరొక కాలుమీదకి బరువు మారుస్తూ, "యెగార్... యెగార్..." అంటూ పిలిచాడు.

"కూర్చో," యెగార్ కష్టంమీద పెదాలను కదిలించాడు.

తల విచారంగా ఆడిస్తూ ఫ్యొడార్ ఇపటొవిచ్ మంచం అంచుమీద కూర్చున్నాడు. దింపుకోలేని బరువు మోస్తున్నట్టు ఉన్నాడతడు, దాంతో అతడు బాధపడుతున్నాడు. అతడు బాధపడుతున్నాడని యెగార్‌కి తెలుసు, దానికి కారణం కూడా తెలుసు.

"బతికే ఉన్నావా, యెగార్?"

"ఊఁ."

ఫ్యొడార్ ఇపటొవిచ్ మళ్లీ నిట్టూర్చాడు. ఇందాకటినుంచి చాటుగా పట్టుకుని ఉన్న ఒక లావుపాటి సీసాని బయటకు తీసాడు.

ఆ సీసా మూత తియ్యటానికి ప్రయత్నిస్తున్నాడు కానీ వణుకుతున్న అతని వేళ్లు అతని మాట వినటం లేదు.

"భయపడవద్దు, ఫ్యొడార్ ఇపటొవిచ్."

"ఏమిటి?" బుర్యానోవ్ ఉలిక్కిపడి కళ్లు పెద్దవి చేసి చూస్తున్నాడు.

"భయపడొద్దన్నాను. బతకటానికి."

ఫ్యాడార్ ఇపటొవిచ్ గట్టిగా గుటకవేశాడు. ఆ శబ్దం గదంతా నిండిపోయింది. అక్కడ బల్లమీద ఉన్న గ్లాసు తీసుకుని సీసాలోంచి సువాసన వెదజల్లుతున్న పసుపుపచ్చ ద్రవాన్ని అందులోకి వంపాడు.

"తాగు, యెగార్. ఒక చిన్న గుటక తాగు."

"అహ్"

"ఒక్క చిన్న గుక్క తాగు, యెగార్ సవెలిచ్. దీని ఖరీదు ఇరవైఅయిదు రూబుళ్లు. మనకోసం తయారు చేసిన సరుకు కాదిది."

"అవును, మనకోసం కాదిది, ఫ్యాడార్."

"తాగు, యెగార్. దయచేసి నా మనస్సుకి శాంతం చేకూర్చు!"

"నీపట్ల నాకెటువంటి కోపం లేదు, ఫ్యాడార్. ఉన్నదంతే ప్రశాంతతే. ఇంటికి వెళ్లు."

"కానీ యెగార్, ఎలా –"

"ప్రపంచం అలాగే ఉందనుకుంటా."

ఫ్యాడార్ ఇపటొవిచ్ ముక్కు ఎగబీల్చి, గ్లాసు కిందపెట్టి మెల్లగా లేచి నుంచున్నాడు.

"కనీసం నన్ను క్షమించు, యెగార్."

"నిన్నెప్పుడో క్షమించాను, వెళ్లు."

ఫ్యాడార్ ఇపటొవిచ్ తన పెద్ద తలను ఊపుతూ ఒక క్షణంపాటు అక్కడ నిలబడ్డాడు. ఆ తరువాత తలుపుకేసి నడవసాగాడు.

"పాల్మాని చంపొద్దు," ఉన్నట్టుండి యెగార్ అన్నాడు. "నన్ను కరవకపోవటం దాని తప్పు కాదు. కుక్కలు నన్ను ఏమీ చెయ్యవు – నాకు వాటి భాష తెలుసు."

ఆసుపత్రి కారిడార్‌లో ఫ్యాడార్ ఇపటొవిచ్ నిదానంగా, భారంగా నడుచుకుంటూ వెళుతున్నాడు. అతడి కుడి చేతిలో మూత తీసిన సీసా ఉంది, అతడు వేసే ప్రతి అడుగుకీ ఖరీదైన ఆ ఫ్రెంచ్ మద్యం కిందకి వలుకుతోంది. గడ్డం చెయ్యని అతడి నల్లటి ముఖం మీదుగా ధారగా కన్నీళ్లు కారుతున్నాయి.

యెగార్ మళ్లీ తన కళ్లు మూసుకున్నాడు, విశాల ప్రపంచం అతడి కళ్లముందు మళ్లీ పరుచుకుంది. బాధనీ, దుఃఖాన్నీ అధిగమించి యెగార్ ఆ ప్రపంచంలోకి అడుగుపెట్టాడు. మంచుతో తడిసి ఉన్న మైదానం, ఆ మైదానంలో ఒక ఎర్రని గుర్రం కనిపించాయి. ఆ గుర్రం అతడిని గుర్తించి సకిలించింది. మెలికలు తిరుగుతూ విషం చిమ్ముతున్న నల్లటి జీవిపై అనాదిగా సాగుతున్న యుద్ధరంగానికి అతడిని తీసుకెళ్లటానికి సిద్ధంగా ఉన్నానని అది ఆహ్వానం పలుకుతోంది.

అలాగే జరుగుగాక. చివరికి చెవి తెగిన కుక్కపిల్ల కోసం కోల్కా పొలుష్కిన్ తన చేపల గాలాన్ని ఇచ్చెయ్యవలసి వచ్చింది. అతడు కూడా తండ్రి లాగానే తన కలల్లో ఎర్ర గుర్రాన్ని స్పష్టంగా చూసాడు.

*రచయిత స్వగతం*

*అడవిలోకి వెళ్లిన ప్రతిసారీ నాకు యెగార్ జీవితం వినపడుతుంది. అది సిగ్గుపడుతూ నన్ను మెల్లగా పలకరిస్తుంది. నేను రైలెక్కి మూడుసార్లు మారిన తరువాత ఆ మారుమూల గ్రామానికి చేరుకుంటాను.*

*కోల్కా, కుక్కపిల్ల త్సుత్సిక్, నేను బజారులగుండా నడుస్తూ పడవలు అద్దెకు ఇచ్చే కేంద్రానికి వెళ్తాం. ఉన్నవాటిల్లోకెల్లా మంచి పడవను యకోవ్ ప్రొకొపిచ్ మాకిస్తాడు. సాయంత్రం హారిటీనా, నేను కూర్చుని టీ తాగుతూ ప్రశంసా పత్రాన్ని చూస్తూ యెగార్‌ని గుర్తుచేసుకుంటాం.*

*యకోవ్ ప్రొకొపిచ్ మాటలు మరింత తాత్వికంగా మారిపోయాయి. క్రోక్ చట్టానికి చిక్కాడు. ఫిల్ చిల్లర మల్లర పనులు కొంచెం చేస్తూ, బాగా తాగుతున్నాడు. ప్రతి వసంతకాలంలో ఈస్టర్ తరువాత రెండవ రోజున స్మశానానికి వెళ్లి యెగార్ సమాధికి కొత్తగా రంగులు వేస్తాడు.*

*"చూస్తూ ఉండు, యెగార్. క్రోక్ తిరిగివచ్చిన తరువాత నీకు చక్కటి శిలాఫలకం ఏర్పాటు చేస్తాం. నెలరోజులపాటు కష్టపడి సంపాదించి, అవసరమైతే తిండైనా మానుకుని ఆ పని పూర్తి చేస్తాం."*

*ఫ్యొడార్ ఇపటొవిచ్ బుర్యానోవ్ కుటుంబమంతటితో వెళ్లిపోయాడు.*

*వాళ్లనుంచి ఉత్తరాలు ఏమీ రావు. అతడి ఇంటిని జప్తు చేశారు: అక్కడ ఇప్పుడు ఒక వసతి గృహం ఉంది. ఇంటిమీద కోడిపుంజు లేదు. పాల్మాని ఫ్యొడార్ ఇపటొవిచ్ కాల్చి చంపేసాడు.*

నల్లచెరువుకి వెళ్లటం కోల్కాకి ఇష్టంగా లేదు. అక్కడ ఇప్పుడు మరొక అటవీ అధికారి ఉన్నాడు. యెగార్ ఏర్పాటు చేసిన కుందేళ్లు, ఉడతల స్థానంలో క్రమేపీ మామూలు సూచికలు చోటుచేసుకుంటున్నాయి. అది తేలిక. అవి స్పష్టంగా కూడా ఉంటాయి.

తిరుగు ప్రయాణంలో చువలోవ్ ఇంటిదగ్గర తప్పకుండా ఆగుతాను. యూరి పెట్రోవిచ్‌కి ఒక అపార్ట్‌మెంట్ ఇచ్చారు. అయితే పెద్ద గదిలో లిండెన్ మోదునుంచి కేవలం గొడ్డలితో యెగార్ చెక్కిన అందమైన అమ్మాయి తల దువ్వుకుంటూ ఉండటంతో అంతగా చోటులేదు. నిండు నెలలతో ఉన్న నోనా యురీవ్నా ఆ విగ్రహం పక్కలనుంచి జాగ్రత్తగా తిరుగుతూ ఉంటుంది.

నల్లచెరువు ఇంకా ఇప్పటికీ ఇంకా నల్లగానే ఉండిపోయింది. అది కోల్కా కోసం ఎదురు చూస్తోందని నాకు అనిపిస్తోంది...

(సమాప్తం)

For Latest Telugu Books - Visit now:
Kinige.com